సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం | 28 | మార్చి | 2025



టన్ను చీనీ రూ.23,100

అనంతపురం మార్కెట్‌యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.23,100, కనిష్టంగా రూ.4 వేల ప్రకారం ధర పలికాయి.



స్థిరంగా టమాట ధర

టమాట ధర స్థిరంగా కొనసాగుతోంది. కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.8, కనిష్టంగా రూ.6 ప్రకారం ధర పలికింది.



దౌర్జన్యం.. దుర్మార్గం

ఏమాత్రం బలం లేకపోయినా కుటిల రాజకీయంతో ఎంపీపీ స్థానాలను కైవసం చేసుకునేందుకు టీడీపీ ప్రజాప్రతినిధులు విశ్వప్రయత్నాలు చేశారు. రొద్దంలో వారి పాచిక పారక పోగా.. గాండ్లపెంట, రామగిరి ఎంపీపీలను తమ ఖాతాలోకి వేసుకోవాలని అరాచకానికి తెరతీశారు.
ఇందులో భాగంగానే ఆ రెండు ఎన్నికలు శుక్రవారానికి వాయిదా పడ్డాయి. ముఖ్యంగా రామగిరిలో 'పరిటాల' కుటుంబం దౌర్జన్యకాండ అందరినీ బెంబేలెత్తిస్తోంది.

- రామగిరి ఎంపీపీ ఎన్నికలో పరిటాల కుటిల రాజకీయం
- ప్లాన్ ప్రకారం ఎన్నిక వాయిదా వేయించిన వైనం
- వైఎస్సార్‌సీపీ సభ్యురాలు భారతి కిడ్నాప్
- గాండ్లపెంటలోనూ సమయం దాటిందని ఎన్నిక వాయిదా
- రొద్దంలో బెడిసికొట్టిన టీడీపీ ప్లాన్



పెనుకొండ: యుద్ధ వాతావరణాన్ని తలపిస్తున్న తహసీల్దార్ కార్యాలయ ఆవరణ



పెనుకొండ: తహసీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించిన మాజీ మంత్రి ఉషశ్రీచరణ్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పార్టీ శ్రేణులు



బైండోవర్ కోసం తహసీల్దార్ ఎదుట హాజరైన రామగిరి ఎంపీటీసీలు



పెనుకొండ తహసీల్దార్ కార్యాలయం లోపలికి వెళ్లకుండా మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిని అడ్డుకుంటున్న పోలీసులు

సాక్షి, పుట్టపర్తి/ పెనుకొండ రూరల్/ పెనుకొండ: ప్రత్యక్ష ఎన్నికల్లో ప్రత్యర్థులను ఎదుర్కొనే సత్తా లేక 'పరిటాల' కుటుంబం పైశాచిక రాజకీయం చేసింది. రౌడీయిజం చేస్తూ.. దౌర్జన్యకాండ సృష్టించి.. అధికారులను అడ్డు పెట్టుకుని ఎంపీపీ ఎన్నికల్లో పైచేయి సాధించాలని ప్రయత్నించింది. మాజీ మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె తనయుడు పరిటాల శ్రీరామ్ ఆదేశాలతో రామగిరి ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్ తాను ఓ పోలీసు అధికారి అనే విషయం మర్చిపోయారు. పచ్చ కండువా వేసుకున్న కార్యకర్త తరహాలో చక్రం తిప్పడం చర్చనీయాంశమైంది. మొన్నటి వరకూ సెలవులో ఉన్న ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్ ఉన్నఫలంగా ఎంపీపీ ఎన్నికల సమయంలో విధుల్లో చేరడం పలు అనుమానాలకు తావిస్తోంది. సజావుగా ఎన్నిక జరిగితే ఓడిపోతామని తెలిసే ఎమ్మెల్యే పరిటాల సునీత దిగజారుడు రాజకీయానికి శ్రీకారం చుట్టారు. అధికారులను పావులుగా వాడుకొని దొడ్డిదారిన వైఎస్సార్‌సీపీ సభ్యులను బెదిరించి, ప్రలోభాలకు గురి చేసి, పదవులను ఆఫర్ చేసి లాక్కోవాలనే ప్రయత్నం చేశారు. ప్లాన్ ఫలించకపోయేసరికి ఎన్నికను వాయిదా వేయించారు.

అభ్యర్థి లేకున్నా కక్కుర్తి రాజకీయం..

రామగిరి ఎంపీపీ పదవి మహిళకు రిజర్వు చేసిన సంగతి తెలిసిందే. అయితే టీడీపీ తరఫున ఒక్క పురుషుడు మాత్రమే గెలిచారు. పార్టీ ఫిరాయించిన మరో ఇద్దరు కూడా పురుషులే కావడంతో రామగిరి నుంచి టీడీపీ తరఫున నామినేషన్ వేసేందుకు కూడా అభ్యర్థి లేరు. అయితే ప్రలోభాలకు గురి చేసి వైఎస్సార్‌సీపీ సభ్యులను లాక్కొని టీడీపీ కండువా వేసి ఎంపీపీ పదవి చేజిక్కించుకోవాలని పరిటాల సునీత వేసిన ప్లాన్ అట్టర్‌ఫ్లాప్ అయింది. రామగిరి మండలంలో 10 ఎంపీటీసీ స్థానాలకు 9 చోట్ల వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలిచారు. అందులో ఎంపీపీగా ఉన్న మీనుగ నాగమ్మ మరణించారు. ఎంపీపీ పదవి దక్కాలంటే కనీసం ఐదుగురు మద్దతు అవసరం.

కావాలనే కాలయాపన..

వైఎస్సార్‌సీపీ సభ్యులు ఆరుగురు గురువారం బెంగళూరు నుంచి రామగిరికి ఎన్నికల కోసం వస్తుండగా.. బాగేపల్లి టోల్ ప్లాజా వద్దకు పోలీసులు చేరుకుని.. హైకోర్టు ఉత్తర్వుల మేరకు బందోబస్తు మధ్య రామగిరి తీసుకెళ్తామని.. మిగతా వాళ్లు రాకూడదని సూచించారు. బాగేపల్లి నుంచి ఏడు వాహనాల్లో వైఎస్సార్‌సీపీ సభ్యులతో రామగిరికి బయలుదేరారు. అయితే కాన్వాయ్ చెన్నేకొత్తపల్లి దాటే సమయానికి మధ్యాహ్నం 12 గంటలైంది. ఆ సమయానికి రామగిరి ఎంపీడీఓ కార్యాలయానికి ముగ్గురు సభ్యులు మాత్రమే చేరుకోవడంతో నామినేషన్ దాఖలు చేసేందుకు గడువు మీరింది. ఎన్నికను మరుసటి రోజుకు వాయిదా వేస్తున్నట్లు ప్రిసైడింగ్ ఆఫీసర్ సంజీవయ్య ప్రకటించారు.

ఎమ్మెల్యేతో వీడియో కాల్స్..

రామగిరి ఎంపీపీ ఎన్నిక వాయిదా పడినట్లు తెలియడంతో వైఎస్సార్‌సీపీ సభ్యులను తిరిగి కర్ణాటక సరిహద్దు దాటించే వరకూ బందోబస్తులో ఉండాలి. అయితే ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్ కల్పించుకుని వైఎస్సార్‌సీపీ సభ్యులతో వీడియో కాల్స్ ద్వారా పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌తో మాట్లాడించారు. పదవులు ఆఫర్ చేసి.. డబ్బు ద్వారా ప్రలోభాలకు గురి చేశారు. పార్టీ మారకుంటే ఇబ్బందులు తప్పవని బెదిరించారు. అయితే వైఎస్సార్‌సీపీ సభ్యులందరూ ఒకే మాటపై నిలబడి.. పార్టీ మారే ప్రసక్తే లేదని తెగేసి చెప్పారు. సీకే పల్లి నుంచి పెనుకొండ వెళ్లే లోపు ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్ మూడు వాహనాలు మారడం అనుమానాలకు తావిస్తోంది.

మహిళా ఎంపీటీసీ కిడ్నాప్..

లీగల్ ప్రొసీజర్ ప్రకారం వైఎస్సార్‌సీపీ సభ్యులను పెనుకొండ తహసీల్దార్ కార్యాలయానికి తరలించాలని పోలీసులు సూచించారు. దీంతో తహసీల్దార్ కార్యాలయానికి తీసుకెళ్లారు. అయితే పక్కా ప్లాన్‌తో వచ్చిన టీడీపీ నేతలు వాహనాల్లో వచ్చి పేరూరు -2 ఎంపీటీసీ సభ్యురాలు భారతిని బలవంతంగా తమ కారులో ఎక్కించుకుని వెళ్లిపోయారు. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తహసీల్దార్ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించినా పోలీసులు అడ్డుకున్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ నాయకులు, కార్యకర్తలు దాడికి యత్నించారు. మహిళా అభ్యర్థి ఉంటే.. నామినేషన్ దాఖలు చేసి.. ఏదో విధంగా బెదిరించి పార్టీ మార్చుకోవచ్చనే ఆలోచనతో పరిటాల సునీత ప్లాన్ చేసి దళిత మహిళను ఇరకాటంలో పడేశారు.

మాజీ మంత్రి, జెడ్పీ చైర్‌పర్సన్ నిరసన..

పోలీసుల తీరును ఎండగడుతూ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ వైఎస్సార్‌సీపీ శ్రేణులతో కలసి అంబేడ్కర్ సర్కిల్లో రోడ్డుపై బైఠాయించారు. ఎంపీటీసీ భారతిని పోలీసులు టీడీపీ వర్గీయులకు అప్పజెప్పారని, ఇది ప్రజాస్వామ్యాన్ని కాలరాసే కుట్ర అని మండిపడ్డారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ టీడీపీకి వత్తాసు పలుకుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశాంతంగా ఉన్న పెనుకొండలో మళ్లీ ఫ్యాక్షన్ బీజాలు వేస్తున్నారని విమర్శించారు. అనంతరం పోలీసులు వారిని బలవంతంగా అక్కడి నుంచి పంపించారు.

ప్రశాంత ప్రాంతంలో కల్లోల వాతావరణం..

కొన్నేళ్లుగా ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న పెనుకొండలో పరిటాల అనుచరుల వికృత చేష్టలతో నాడు పరిటాల రవీంద్ర చేసిన అరాచకాలు గుర్తొచ్చాయి. ముందు రోజు రామగిరి ఎంపీడీఓ కార్యాలయం వద్ద అల్లర్లు.. ఎన్నికల రోజున పెనుకొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద వైఎస్సార్‌సీపీ సభ్యురాలు భారతి కిడ్నాప్ ఉదంతంతో ప్రజలు బయటికి రావాలంటేనే భయపడుతున్నారు.

రొద్దం ఎంపీపీగా నాగమ్మ



ఎంపీపీగా డిక్లరేషన్ అందుకుంటున్న నాగమ్మ

రొద్దం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ఎంపీపీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా నల్లూరు పంచాయతీ ఎంపీటీసీ సభ్యురాలు నాగమ్మను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 2019 ఎన్నికల్లో మొత్తం 15 మంది ఎంపీటీసీ స్థానాలు ఉండగా 15 స్థానాలూ వైఎస్సార్‌సీపీ సభ్యులు గెలుపొందారు. గత ఏడాది ఎంపీపీ చంద్రశేఖర్ అనారోగ్యంతో మృతి చెందడంతో ఎంపీటీసీ స్థానాల సంఖ్య 14కు చేరింది. నాగమ్మకు మద్దతుగా మిగిలిన వారంతా చేతులెత్తారు. ఎన్నిక అధికారులు నాగమ్మను ఎంపీపీగా ప్రకటించారు. ఎన్నికల అధికారులు చేతుల మీదుగా ఆమె డిక్లరేషన్ పత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో ఎన్నికల ప్రొసిడింగ్స్ అధికారి విజయప్రసాద్, ఎంపీడీఓ రామ్‌కుమార్ పాల్గొన్నారు.

అడ్డుకొని.. వాయిదా వేయించి

- గాండ్లపెంటలో అడుగడుగునా పచ్చ ఆటంకం



గాండ్లపెంట ఎంపీడీఓ కార్యాలయంలో కూర్చున్న ఎంపీటీసీ సభ్యులు

గాండ్లపెంట: బలంలేకపోయిన ఎంపీపీ పదవిని దక్కించుకునేందుకు టీడీపీ కుటిల యత్నాలకు తెరలేపింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ ఎన్నిక నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 7 ఎంపీటీసీ స్థానాలు ఉండగా వాటిలో సోమయాజులపల్లి స్థానంలో మాత్రమే టీడీపీ గెలుపొందింది. మిగిలిన 6 ఎంపీటీసీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించింది. అయితే వేపరాల ఎంపీటీసీ టీడీపీకి మద్దతు ప్రకటించడంతో వైఎస్సార్‌సీపీ వైపు ఐదుగురు ఎంపీటీసీలు ఉన్నారు. సభలో టీడీపీకి ఇద్దరు సభ్యులు ఉండగా సంఖ్యా బలం లేకపోవడంతో పాటు బలపరిచే వారు కూడా లేరు. ఎంపీపీ ఎన్నికలో పాల్గొనాల్సిన ఎంపీటీసీలు 11 గంటలకు కార్యాలయానికి చేరుకోవాల్సి ఉన్నా టీడీపీ ఇద్దరు ఎంపీటీసీలు చేరుకోగా .. వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు కదిరి నుంచి గాండ్లపెంటకు వస్తుండగా మార్గమధ్యలో కదిరి-రాయచోటి ప్రధాన రహదారిలో ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్ వద్ద పోలీసులు సోదాల పేరుతో గంటల కొద్దీ అడ్డుకున్నారు. దీంతో ఆలస్యం జరిగింది. అక్కడి నుంచి కదిరి టౌన్ సీఐ ఎంపీటీసీలను తన వాహనంలో తీసుకువచ్చారు. ప్రధాన రహదారిలో ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లే సమయంలో వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకుడు సీఎస్ అబ్దుల్ రవూఫ్ ఎంపీటీసీలను పిలుచుకు వస్తుండగా పోలీసులు రవూఫ్‌ను లోపలికి పోకుండా అడ్డుకున్నారు. పార్టీ విప్ అధికారికంగా ఇచ్చిందని, పీఓతో మాట్లాడిన అనంతరం లోపలికి పంపారు. అయితే వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు ఆలస్యంగా వచ్చారంటూ ఎన్నికల అధికారి ఎన్నికను శుక్రవారం 10 గంటలకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. సభను వాయిదా వేయకూడదని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు సమావేశ భవనంలోనే బైఠాయించారు. ఎంపీటీసీలను పరామర్శించేందుకు వెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకులకు, టీడీపీ నాయకులకు మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. పోలీసులు అందరిని అక్కడి నుంచి పంపివేశారు.

జేబుల్లో కారం.. చేతిలో రాళ్లు



కంబదూరు ఎంపీడీఓ ఆఫీస్ దగ్గర వైఎస్సార్‌సీపీ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు (ఇన్‌సెట్) ఎంపీపీ కే. లక్ష్మీదేవి

అనంతపురం జిల్లా కంబదూరు ఎంపీపీ స్థానాన్ని దక్కించుకునేందుకు టీడీపీ కుట్రలు పన్నింది. ఎన్నిక సందర్భంగా 'పచ్చ' నాయకులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించారు. ఎంపీటీసీలను ప్రలోభాలకు గురిచేశారు. ఒక్కొక్కరికి రూ.3 నుంచి రూ.4 లక్షలు ఇస్తామని బేరసారాలు చేశారు. ఈ క్రమంలోనే ఏకంగా డీఎస్పీ, ఆర్డీఓ వాహనాలపై రాళ్ల దాడికి యత్నించారు. జేబుల్లో కారం పొడి.. రాళ్లతో వచ్చి వీరంగం సృష్టించారు. అరగంట పాటు విద్యుత్‌కు అంతరాయం కలిగించారు. మండలంలోని ఒంటారెడ్డి పల్లి వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ ఏనుముల సోమశేఖర్‌ను ఎన్నికకు అరగంట ముందు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఆయన ఎలాగోలా వారి నుంచి తప్పించుకుని తిరిగి ఎన్నిక ప్రక్రియలో పాల్గొనడం గమనార్హం. ఇక.. ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మండల ఎంపీపీగా రాళ్ల అనంతపురం ఎంపీటీసీ కే. లక్ష్మీదేవి ఎన్నుకుంటూ వైఎస్సార్ సీపీ సభ్యులు ప్రవేశపెట్టిన తీర్మాన ప్రతిని ములకనూరు ఎంపీటీసీ తిమ్మరాజమ్మ చింపివేశారు. దీంతో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. మరో వైపు ఎన్నిక మధ్యలో ప్రిసైడింగ్ ఆఫీసర్ మద్దిలేటి అనారోగ్యం పాలవడం కలకలం రేపింది. వెంటనే ఆయన్ను కంబదూరు ప్రభుత్వ ఆస్పత్రికి.. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం అనంతపురం సర్వజనాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ వెంటనే అక్కడకు చేరుకుని ఎన్నికల అధికారిగా శెట్టూరు తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టిని నియమించి.. ప్రక్రియను పూర్తి చేయించారు. ఎంపీపీగా కే. లక్ష్మీదేవి ఏకగ్రీవంగా ఎంపికైనట్లు జేసీ శివ్ నారాయణ శర్మ ప్రకటించారు.

పరిటాల కోసమే పని చేస్తున్నారా?



హైకోర్టు ఆదేశాల మేరకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు పరిటాలకు అనుకూలంగా పని చేయడం దారుణం. పోలీసులు తమ పని తాము చేస్తే.. ఓ దళిత మహిళ ఎలా కిడ్నాప్‌కు గురవుతుంది. మా ఎంపీటీసీ సభ్యులతో పరిటాల సునీతతో ఫోన్ కాల్స్ ఎలా మాట్లాడిస్తారు? పరిటాల కుటుంబానికి అనుకూలంగా పని చేసేందుకే వచ్చి ఉంటే యూనిఫాం తీసి.. పచ్చ కండువా వేసుకుని తిరగండి. బందోబస్తులో ఉండాల్సిన పోలీసులు పరిటాల సునీతతో ఫోన్ కాల్స్ మాట్లాడించాల్సిన అవసరం ఏముంది. మొన్నటి దాకా సెలవులో ఉన్న ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్ ఉన్నఫలంగా డ్యూటీకి ఎందుకొచ్చాడు. పరిటాల సునీతకు ఊడిగం చేసేందుకే వచ్చాడా?

– తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే

అధికారం ఉందనే అరాచకం



గత ఎంపీటీసీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికలను చంద్రబాబు బహిష్కరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందని అధికార మదంతో ఇప్పుడు అరాచకం చేస్తున్నారు. బెదిరింపులు, దౌర్జన్యాలతో ఎంపీటీసీలను తమ వైపు తిప్పుకొని ఎంపీపీ స్థానాలను కైవసం చేసుకునేందుకు యత్నించడం సిగ్గుచేటు. రొద్దంలో టీడీపీ ప్రలోభాలకు వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు తలొగ్గలేదు. రామగిరి, గాండ్లపెంటలో వైఎస్సార్‌సీపీకి బలమున్నా దౌర్జన్యం చేస్తున్నారన్నారు. జిల్లాలో పోలీస్ యంత్రాంగం కూడా అధికార పార్టీ నేతలకు సపోర్ట్ చేయడం బాధాకరం. పోలీస్ యంత్రాంగాన్ని అడ్డు పెట్టుకుని రాజకీయం చేయడం దుర్మార్గం.

– ఉషశ్రీచరణ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు

పడిపోయిన చింత పండు ధర



మార్కెట్‌కు వచ్చిన చింతపండు

హిందూపురం అర్బన్: హిందూపురం మార్కెట్‌లో చింత పండు ధరలు తగ్గుముఖం పట్టాయి. గత రెండు వారాలతో పోలిస్తే క్వింటాపై రూ.6,000 తగ్గుదల కనిపించింది. గురువారం మార్కెట్‌కు 1,700 క్వింటాళ్ల చింత పండు రాగా ఈ నామ్ పద్ధతిలో మార్కెట్‌లో వేలం పాట నిర్వహించారు. కరిపులి రకం గత రెండు వారాల క్రితం గరిష్టంగా క్వింటా రూ.33 000 పలుకగా ఈవారం 27,000 పలికింది. కనిష్టం రూ. 8,100గా పలికింది. సగటున రూ.13,500 పలికింది. ఇక.. ఫ్లవర్ రకం క్వింటా గరిష్ట ధర రూ. 12,500 పలుకగా కనిష్ట ధర రూ.4,500 పలికింది. సగటు ధర రూ.7,500 పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జి. చంద్రమౌళి తెలిపారు. గత వారం అక్కడక్కడా వడగండ్ల వర్షం కురవడం, వాతావరణ మార్పులు ధరలపై ప్రభావం చూపాయన్నారు.

బాబోయ్.. దోపిడీ దొంగలు



ఆమిద్యాల పెట్రోలు బంకులో ధ్వంసం చేసిన సీసీ కెమెరాలు



ఆమిద్యాల పెట్రోలు బంకు వద్ద వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్ టీం సభ్యులు, పోలీసులు



వజ్రకరూరు పెట్రోలు బంకులో నగదును దోచుకుంటున్న దొంగల ముఠా సభ్యులు



ఆమిద్యాల పెట్రోలు బంకును దోపిడీ చేయడానికి బొలెరో వాహనం నుంచి దిగుతున్న దొంగలు (సీసీ కెమెరా ఫుటేజీ)

ఉరవకొండ: నియోజకవర్గ పరిధిలోని వజ్రకరూరు, ఆమిద్యాల గ్రామాల్లో ఉన్న పెట్రోల్ బంకుల్లో దోపిడీ దొంగలు స్వైరవిహారం చేశారు. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకూ కత్తులు, రాడ్లతో హల్‌చల్ చేశారు. ఆమిద్యాలలోని రంగమ్మ ఫిల్లింగ్ స్టేషన్ బంక్ వద్దకు బొలెరో వాహనంలో చేరుకున్న ఏడుగురు యువకులు ముఖానికి కర్చీఫ్‌లు కట్టుకుని అక్కడ నిద్రిస్తున్న సిబ్బందిని లేపి కత్తులు, రాడ్లతో బెదిరిస్తూ ఓ మూలన కూర్చొబెట్టారు. మేనేజర్ గదిలోకి చొరబడి రూ.2.80 లక్షలు అపహరించారు. సీసీ కెమెరాలను ధ్వంసం చేసి హార్డ్ డిస్క్‌లను ఎత్తుకెళ్లారు. అనంతరం వజ్రకరూరులోని శివశక్తి పెట్రోల్ బంకులోనూ సిబ్బందిని బెదిరించి రూ1.20 లక్షలను అపహరించారు. విషయం తెలుసుకున్న ఉరవకొండ రూరల్ సీఐ సయ్యద్ చిన్నగౌస్, అర్బన్ సీఐ మహనంది, ఎస్‌ఐ జనార్ధన్‌నాయుడు, వజ్రకరూరు ఎస్‌ఐ నాగస్వామి, క్లూస్ టీం సభ్యులు అక్కడకు చేరుకుని నిందితుల వేలిముద్రలు సేకరించారు. సీసీ టీవీ ఫుటేజీ స్వాధీనం చేసుకుని ఆమిద్యాల పెట్రోల్ బంకు మేనేజర్ పెద్దన్న, వజ్రకరూరు బంకు మేనేజర్ రామాంజినేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, దోపిడీ దొంగలు హిందీలో మాట్లాడడంతో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వారుగా అనుమానాలు వ్యక్తమయ్యాయి.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో ముగ్గురికి స్థానం

పుట్టపర్తి: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీలో జిల్లా నుంచి ముగ్గురికి స్థానం కల్పించినట్లు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వలంటీర్ విభాగం ప్రధాన కార్యదర్శిగా గంగాధర్‌రెడ్డి, రాష్ట్ర బూత్ కమిటీ విభాగం ప్రధాన కార్యదర్శిగా రొద్దం రవీందర్‌రెడ్డి, రాష్ట్ర సోషల్ మీడియా విభాగం జాయింట్ సెక్రటరీగా మన్‌ప్రీతమ్‌రెడ్డిలను నియమించినట్లు పేర్కొంది.

ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

పుట్టపర్తి: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన డీఎస్సీ అభ్యర్థులకు ప్రభుత్వం ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా సోషల్ వెల్ఫేర్ అధికారి శివరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని ఆయా వర్గాల వారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో ఉచితంగా శిక్షణ ఇప్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 28వ తేదీలోపు కోచింగ్ కేంద్రాల పేర్లను ఎంపిక చేసుకోవాలని సూచించారు.

యోగా అవార్డుల ప్రమోషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి టౌన్: జిల్లాలో యోగా అవార్డుల ప్రమోషన్‌కు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఉదయభాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. జూన్21 అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాను ప్రోత్సహించడానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జాతీయ, అంతర్జాతీయ అవార్డులు ప్రకటించారన్నారు. ఉత్తమ సమాజ నిర్మాణానికి కృషి చేస్తున్న వ్యక్తులతో పాటు సంస్థలను సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన వారు https:// innovateindia. mygov. in/pm& yoga&awards&2025/ వెబ్‌సైట్‌లో ఈనెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 9849421462 ఫోన్‌నంబర్‌ను సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ బోల్తా ... డ్రైవర్ మృతి



ట్రాక్టర్ ఇంజన్ కింద చిక్కుకున్న నాగేంద్ర మృతదేహం

సోమందేపల్లి: మండలంలోని మేకలపల్లి సమీపంలో ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ నాగేంద్రబాబు(20) మృతిచెందాడు. గురువారం ఇసుక లోడ్‌తో పెనుకొండకు వెళ్లి అన్‌లోడ్ చేసిన అనంతరం తన స్వగ్రామమైన రొద్దం మండలం నల్లూరుకు వెళుతుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తా పడింది. ఘటనలో తీవ్రంగా గాయపడిన నాగేంద్ర బాబు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

'ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్‌ను సస్పెండ్ చేయాలి'



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులు

అనంతపురం కార్పొరేషన్: శ్రీసత్యసాయి జిల్లా రామగిరి పీఎస్ ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్‌ను సస్పెండ్ చేయాలంటూ వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొని నాగన్న, సమాచార హక్కు చట్టం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం అనంతపురం జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా పోలీసులు వ్యవహరిస్తున్నారంటూ మండిపడ్డారు. హైకోర్టు చీవాట్లు పెట్టినా వారి పనితీరులో మార్పు రావడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన న్యాయవాది నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ బోయ రామాంజినేయులు ఈ నెల 26న ఎంపీడీఓ కార్యాలయానికి వెళితే వారిపై దాడులకు తెగబడిన టీడీపీ గుండాలపై చర్యలు తీసుకోవాల్సిన ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్ ఏకపక్షంగా వ్యవహరించడాన్ని ఆక్షేపించారు. సమావేశంలో లీగల్ సెల్ నగరాధ్యక్షుడు ఎస్ వెంకటరాముడు, తదితరులు పాల్గొన్నారు.

'ఏపీ సూపర్ కప్' విజేత గోదావరి క్లబ్



గోదావరి క్లబ్ జట్టుకు విజేత ట్రోఫీని అందజేస్తున్న కోటగిరి శ్రీధర్

అనంతపురం: రాష్ట్రంలో తొలిసారిగా అనంతపురంలోని ఆర్డీటీ క్రీడాగ్రామం వేదికగా నిర్వహించిన ఏపీ సూపర్ కప్ ఫుట్‌బాల్ టోర్నీ విజేతగా గోదావరి క్లబ్ జట్టు నిలిచింది. గురువారం కొల్లేరు ఫుట్‌బాల్ క్లబ్ (ఏలూరు, తూర్పుగోదావరి, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలు) – గోదావరి ఫుట్‌బాల్ క్లబ్ (తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాలు) జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠగా సాగింది. 2–1 గోల్స్ తేడాతో గోదావరి క్లబ్ జట్టు విజయ కేతనం ఎగురవేసింది. ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోటగిరి శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై విజేత జట్టుకు ట్రోఫీతో పాటు రూ.5 లక్షల నగదు పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డేనియల్ ప్రదీప్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పని భారం.. తాళలేం!

- ఆస్తి పన్ను వసూళ్లు, సర్వేలతో పాటు గ్రీవెన్స్ సమస్యలతో సతమతం
- లక్ష్యాలు పూర్తి కాకపోతే ఎంపీడీఓలతో చివాట్లు
- పనిభారం తగ్గించాలంటూ కార్యదర్శుల గగ్గోలు





పని ఒత్తిడి తగ్గించాలంటూ జేసీ అభిషేక్‌కుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు (ఫైల్), సర్వేలో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శి (ఫైల్)

పుట్టపర్తి అర్బన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రోజురోజుకూ పనిభారం పెరిగిపోతుండడంతో పంచాయతీల కార్యదర్శులు సతమతమవుతున్నారు. ఆస్తి పన్ను వసూళ్లు, సర్వేలు, రోజు వారీ విధులు, పారిశుధ్య నిర్వహణ వంటి పనులతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక సమీక్షల పేరుతో గంటల తరబడి జూమ్ మీటింగ్‌లు, తరచూ నిర్వహించే సమావేశాలతో రోజూ నిర్వహించే పనులు చతికిలబడుతున్నాయి. అధికారులు ఇచ్చిన లక్ష్యాలను చేరుకోకపోవడంతో నిత్యం ఏదో ఒక పంచాయతీ కార్యదర్శికి మెమోలు అందుతున్నాయి.

సర్వేలతో ముప్పుతిప్పలు..

జిల్లాలో 457 పంచాయతీలు ఉండగా దాదాపు అన్ని పంచాయతీల్లో కార్యదర్శులు ఉన్నారు. నిత్యం పంచాయతీలకు వెళ్లి సంతకాలు చేసిన అనంతరం రోజు వారీ విధులను నిర్వర్తించాల్సి ఉంటుంది. ఆస్తి పన్ను వసూలు చేయడానికి గతంలో బిల్ కలెక్టర్ ఉండేవారు. ప్రస్తుతం ఈ విధులు కూడా పంచాయతీ కార్యదర్శులే నిర్వర్తిస్తున్నారు. నెలలో మొదటి రెండు మూడు రోజులు పింఛన్లను ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేయాలి. మిగిలిన మొత్తాలను సెర్ప్‌కు పంపాల్సి ఉంటుంది. ప్రజలు అడిగిన పంచాయతీ పరిధిలోని పనులను ఠంచన్‌గా చేసిపెట్టాలి. లేదంటే వారి నుంచి వ్యతిరేకతను చవిచూడాల్సి వస్తుంది. సిటిజన్ సర్వే, మిస్సింగ్ ఎంప్లాయీస్ సర్వే, పీ4 సర్వే, విలేజ్ సర్వేలను కార్యదర్శులకు అప్పగించారు. ట్యాంక్ క్లీనింగ్, క్లోరినేషన్, స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు, డంపింగ్ యార్డుల నిర్వహణ, చెత్తతో సంపద తయారీ, నీటి సమస్యలు, రికార్డుల నిర్వహణ, సర్టిఫికెట్ల జారీ, సచివాలయ సిబ్బందితో పనులు చేయించడం, లీజు వసూళ్లు, వేలం పాటలు, పిల్లల మిస్సింగ్ ఆధార్ సర్వే, డెత్ రీ వెరిఫికేషన్ సర్వే తదితర సర్వేలతో ముప్పుతిప్పలు పడుతున్నారు.

పస్తులతో విధుల నిర్వహణ..

ప్రభుత్వ నిర్దేశిత సర్వేల కోసం సెలవు దినాల్లోనూ కార్యదర్శులు పనిచేయాల్సి వస్తోంది. లేదంటే నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయలేక అధికారులతో చీవాట్లు తినాల్సి వస్తుంది. సర్వే సమయంలో ముఖ్యంగా అటవీ ప్రాంతాల్లో పనిచేసే కార్యదర్శులు నెట్‌వర్క్ సమస్యతో ఒకే ఇంటి వద్ద గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. దీంతో సకాలంలో భోజనాలు కూడా చేయలేక పస్తులతోనే పూట గడపాల్సి వస్తోంది. ప్రతి సోమవారం మండల కార్యాలయాలతో పాటు కలెక్టరేట్‌లో అందే ఫిర్యాదులను పరిష్కరించడానికి క్షేత్రస్థాయి పర్యటనలు తప్పనిసరిగా చేయాల్సి ఉంది. అక్కడ ఇరువర్గాల వాగ్వాదంతో సమస్య జఠిలమై మరింత ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది. దీంతో పాటు కలెక్టరేట్‌కు ప్రతి సోమవారం అర్జీలు ఇచ్చేందుకు వచ్చే వారికి సేవలు చేయడానికి వారానికి కొందరు చొప్పున విధులో పాల్గొనాల్సి వస్తోంది.

సర్దుకుపోండి..

గతంలో నాయకులకు, కార్యకర్తలకు సిబ్బందిపై గౌరవం ఉండేది. రాష్ట్రంలో కూటమి సర్కార్ ఏర్పాటైన తర్వాత పంచాయతీ కార్యదర్శుల విధులు అడకత్తెరలో పోకచెక్కలా మారాయి. సక్రమంగా విధులు నిర్వర్తిస్తున్నా నాయకుల ఒత్తిళ్లతో అధికారుల చివాట్లు తినాల్సి వస్తోంది. దీంతో తమ సమస్యను తొలి విడతలో ఆయా మండలాల ఎంపీడీఓల దృష్టికి కార్యదర్శులు తీసుకెళ్లారు. దీనిపై తామేమీ చేయలేమంటూ ఎంపీడీఓలు చేతులెత్తయడంతో పాటు సర్దుకుపోవాలంటూ ఉచిత సలహా ఇస్తుండడం గమనార్హం. దీంతో ఇటీవల జేసీ అభిషేక్‌కుమార్‌ను కలసి తమ గోడు వెల్లబోసుకున్నారు. పని ఒత్తిడితో కుటుంబసభ్యులు, పిల్లలతో సరదాగా గడప లేక పోతున్నట్లు వాపోయారు.

సర్వేలతో సతమతం



ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నాం. కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో లేకుండా ఇంటింటికీ తిరగాల్సి వస్తోంది. కొన్ని సర్వేలకు ప్రజల నుంచి ఓటీపీలు తీసుకోవాలి. ఆ సమయంలో చాలా మంది ఓటీపీలు చెప్పడం లేదు. దీంతో సమస్య మరింత జఠిలమవుతోంది. మా బాధలు వర్ణనాతీతం.

– రామ్మోహన్, ఏపీ గ్రామ కార్యదర్శుల సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్

పని భారం పెరిగింది



పంచాయతీ పరిధిలో ప్రతి పనినీ కార్యదర్శులకు అప్పగిస్తున్నారు. దీంతో పని భారం పెరిగింది. సుమారు 35 రకాలకు పైగా సేవలందిస్తున్నాం. అటవీ ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యతో మరింత ఇబ్బందులు పడాల్సి వస్తోంది. పని పూర్తి కాకపోతే షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు చేయాల్సి ఉంటుంది.

– ఓంప్రసాద్, ఏపీ పంచాయతీ కార్యదర్శుల పబ్లిసిటీ సెక్రటరీ

క్యాబ్‌ను ఢీ కొన్న కారు

- నలుగురు ఉపాధ్యాయులకు తీవ్రగాయాలు
- మరో ఆరుగురికి స్వల్పగాయాలు



తీవ్రంగా గాయపడిన ఆనందరెడ్డి, పి.ఉమాదేవి

బత్తలపల్లి: స్థానిక జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో నలుగురు ఉపాధ్యాయులు తీవ్రంగా గాయపడ్డారు. మరో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులు తెలిపిన మేరకు.. బత్తలపల్లి మండలం నల్లబోయనపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పలువురు ఉపాధ్యాయులు సమీపంలోని అనంతపురం నగరంలో నివాసముంటూ రోజూ విధులకు వచ్చి వెళుతుంటారు. ఈ క్రమంలో సమయానికి పాఠశాలకు చేరుకునేందుకు వీలుగా ఓ ప్రైవేట్ క్యాబ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. గురువారం విధులకు హాజరైన ఉపాధ్యాయులు సాయంత్రం పాఠశాలల వేళలు ముగిసిన తర్వాత క్యాబ్‌లో అనంతపురానికి తిరుగు ప్రయాణమయ్యారు. చిత్రావతి నది బ్రిడ్జి దాటిన తర్వాత ఉప్పర్లపల్లి క్రాస్ వద్దకు చేరుకోగానే ముదిగుబ్బ వైపు నుంచి వేగంగా వస్తున్న కారు వెనుక నుంచి క్యాబ్‌ను ఢీ కొంది. దీంతో క్యాబ్ అదుపు తప్పి డివైడర్ ఎక్కి బోల్తాపడింది. ఘటనలో ఉపాధ్యాయులు ఆనందరెడ్డి, బిల్లే ఉమాదేవి, పి.ఉమాదేవి, పార్వతమ్మకు తీవ్రగాయాలయ్యాయి. రామచంద్ర, మహబూబ్‌బాషా, చాంద్‌బాషా, విశాల, అనురాధ, రికార్డు అసిస్టెంట్ పార్వతమ్మ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను స్థానికులు వెంటనే 108 వాహనంలో బత్తలపల్లిలోని ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనపై బత్తలపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, ప్రమాద విషయం తెలుసుకున్న ఎంఈఓలు చాముండేశ్వరి, సుధాకర్‌నాయక్, నల్లబోయనపల్లి హెచ్‌ఎం ప్రహ్లాదనాయుడు, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ మాజీ చైర్మన్ హరినాథరెడ్డి, నాగేశ్వరరెడ్డి, భరత్‌కుమార్‌రెడ్డి, ఓబిరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంజీవరెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, నాగేశ్వరయ్య, అనిల్‌చౌదరి, నాగరాజు, ముదిగుబ్బ మండల నాయకులు సి.రామకృష్ణారెడ్డి, చంద్రమోహన్, చిట్టిబాల ఓబిరెడ్డి, ఎమ్మార్సీ కార్యాలయ సిబ్బంది, పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. ఫోన్ ద్వారా క్షతగాత్రులతో డీఈఓ కిష్టప్ప మాట్లాడారు. వారికి మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓలను ఆదేశించారు.

దళితుడిపై కార్యదర్శి జులుం

సోమందేపల్లి: 'నాపైనే ఫిర్యాదు చేస్తావా? నీపై క్రిమినల్ కేసు పెట్టి జైలుకు పంపుతా' అంటూ ఓ దళితుడిని సోమందేపల్లి పంచాయతీ ఇన్‌చార్జ్ కార్యదర్శి రామాంజనేయులు బెదిరింపులకు దిగాడు. బాధితుడు ప్రకాష్ తెలిపిన మేరకు... సోమందేపల్లిలోని బాలాజీనగర్‌లో ఇళ్ల మధ్య మురుగు నీరు నిలిచిపోవడంతో స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్నారని, వెంటనే మురుగునీటి పారుదల వ్యవస్థను సక్రమం చేయాలంటూ అధికారులకు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదంటూ ఈ నెల 16న ఆన్‌లైన్ ద్వారా సీఎంఓకు స్థానిక దళితుడు ప్రకాష్ ఫిర్యాదు చేశాడు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారణ చేసేందుకు గురువారం కాలనీకి వచ్చిన కార్యదర్శి రామాంజినేయులు అందరి సమక్షంలో ప్రకాష్‌ను దుర్భాషలాడుతూ బెదిరింపులకు దిగాడు. సమస్య ఉందంటూ మరోసారి ఫిర్యాదు చేస్తే క్రిమినల్ కేసు నమోదు చేయించి జైలుకు పంపుతానంటూ హెచ్చరికలు జారీ చేశాడు. అక్కడే ఉన్న ఓ పత్రికా విలేకరిని చూస్తూ గుడ్లురుముతూ పంచాయతీ పరిధిలో సమస్యలున్నాయంటూ వార్తలు రాస్తే క్రిమినల్ కేసు నమోదు చేస్తానంటూ బెదిరించాడు. మురుగు గుంతను తొలగించకుండా కొంతమందికి అనుకూలంగా కార్యదర్శి వ్యవహరించాడంటూ ఈ సందర్భంగా బాధితుడు ఆరోపించాడు. దాదాపుగా పదేళ్లుగా ఇదే మండలంలో తిష్ట వేసిన రామాంజనేయులు ప్రజా సమస్యలు పరిష్కరించకపోగా ప్రజలతో దురుసుగా వ్యవహరిస్తున్నాడంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రత్యామ్నాయంపై పరిశీలకుల బృందం



ఉలవ

అనంతపురం అగ్రికల్చర్: గత ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వేరుశనగ, కంది, పత్తి, ఆముదం, మొక్కజొన్న తదితర ప్రధాన పంటలు తక్కువ విస్తీర్ణంలో సాగులోకి రావడంతో గత సెప్టెంబర్‌లో ప్రత్యామ్నాయ విత్తనాల కింద జిల్లా రైతులకు ఉలవ, పెసర, అలసంద, కొర్ర తదితర వాటిని 80 శాతం రాయితీతో అందించారు. ఇందులో ప్రధానంగా మండలాల వారీగా ఎంత మంది రైతులు ప్రత్యామ్నాయం కింద ఉలవ విత్తనాలు తీసుకున్నారు, వారు విత్తనాలు సాగు చేశారా? పంటలను ఈ–క్రాప్‌లోకి నమోదు చేశారా? తదితర అంశాలు క్షేత్రస్థాయిలో పరిశీలన చేయడానికి బృందాలు (వెరిఫికేషన్ టీమ్స్) ఏర్పాటు చేస్తూ వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాకు ప్రత్యామ్నాయం కింద 27 వేల క్వింటాళ్ల విత్తనాలు కేటాయించగా... ఆలస్యంగా పంపిణీ మొదలు పెట్టడంతో 80 శాతం రాయితీతో 10 వేల క్వింటాళ్ల విత్తనాన్ని అందించారు. ఈ క్రమంలో అనంతపురం జిల్లాకు శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన అసిస్టెంట్ డైరెక్టర్లు (ఏడీ), అగ్రికల్చర్స్ ఆఫీసర్ల (ఏఓ)తో కూడిన 8 మందితో నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. వీరు తమకు కేటాయించిన మండలాల్లో పర్యటించి డీ–కృషి యాప్‌లో విత్తన పంపిణీ డేటా ఆధారంగా రాండమ్‌గా 150 మంది రైతులను కలసి వెరిఫికేషన్ చేయాల్సి ఉంటుంది. డీ–కృషి యాప్, ఈ–క్రాప్ డేటా క్రాస్ చెక్ చేసుకుని 10 ఫార్మాట్ల కింద సమగ్ర నివేదిక సమర్పించాలి. అలాగే శ్రీసత్యసాయి జిల్లాలో పరిశీలనకు అనంతపురం జిల్లాకు చెందిన నలుగురు ఏడీఏలు, నలుగురు ఏఓలతో నాలుగు బృందాలు ఏర్పాటు చేశారు.

పదో తరగతి విద్యార్థి ఆత్మహత్యాయత్నం



విద్యార్థి బాబు

లేపాక్షి: మండలంలోని పులమతి పంచాయతీ పరిధిలోని పి.సడ్లపల్లి గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి బాబు ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు తెలిపిన మేరకు... పులమతిలోని జెడ్పీహెచ్ ఎస్‌లో పదో తరగతి చదువుతున్న బాబు.. ఇటీవల వార్షిక పరీక్షలు సక్రమంగా రాయలేకపోతున్నానని తరచూ బాధపడేవాడు. ఈ క్రమంలోనే గురువారం మధ్యాహ్నం బాటిల్‌లో పెట్రోల్ తీసుకెళ్లి ఇంటి బయట శరీరంపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. విషయం గమనించిన స్థానికులు వెంటనే మంటలు ఆర్పి వేశారు. 108 అంబులెన్స్ ద్వారా హిందూపురంలోని జిల్లాస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అనంతపురానికి రెఫర్ చేశారు. ఘటనపై ఎస్‌ఐ నరేంద్ర కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

చేనేత కార్మికుడి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం అర్బన్: స్థానిక సుందరయ్యనగర్‌కు చెందిన చేనేత కార్మికుడు ముద్దుకృష్ణ గురువారం తన ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆయనను కాపాడు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. కాగా, ఆయన ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై ధర్మవరం రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

కర్బూజ పంటల పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



రైతుతో మాట్లాడుతున్న హెచ్‌ఓ నవీన్‌కుమార్

పుట్టపర్తి రూరల్: 'చేదు మిగిల్చిన తీపి పంట' శీర్షికన ఈ నెల 27న 'సాక్షి'లో వెలువడిన కథనంపై ఉద్యాన అధికారులు స్పందించారు. జిల్లా ఉద్యాన శాఖాధికారి చంద్రశేఖర్ ఆదేశాల మేరకు మండల హెచ్‌ఓ నవీన్‌కుమార్ బృందం గురువారం ఎనుములపల్లి పర్యటించి, రైతులు సాగు చేసిన కర్బూజ పంటలను పరిశీలించారు. నష్టపోయిన రైతుల వివరాలు, ఎంత మేర నష్టం వాటిల్లింది తదితర వివరాలు సేకరించారు. 10 నుండి 15 శాతం వరకు కాయల్లో చీలికలు ఏర్పడిందని, 30 శాతం వరకు పంట నష్టం జరిగినట్లుగా గుర్తించినట్లు నవీన్‌కుమార్ తెలిపారు. న్యూట్రీన్స్ బోరాన్, క్యాల్షియం తగిన మోతాదులో సరైన నీటి తడులు అందిస్తే చీలికలు ఏర్పడకుండా ఉంటాయని వివరించారు. మార్కెటింగ్ సహాయం రైతుల అభ్యర్థనను ఉన్నతాధికారులకు నివేదిస్తామని భరోసానిచ్చారు.

పోక్సో కేసులో నిందితుడికి రిమాండ్

- సహకరించిన 8 మందిపైనా కేసు నమోదు

రొళ్ల: పోక్సో కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ తరలించినట్లు పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. డీఎస్పీ తెలిపిన వివరాల మేరకు.. రొళ్ల మండలంలో ఓ గ్రామంలో ఓ బాలికను అదే గ్రామానికి చెందిన సనావుల్లా (22) మాయ మాటలు చెప్పడంతో పాటు భయపెట్టి లైంగిక దాడి చేశాడన్నారు. బాలిక గర్భందాల్చడంతో విషయం బయటకు వచ్చిందన్నారు. మసీదు మత పెద్దలు, సనావుల్లా తల్లిదండ్రులు బాలిక తండ్రితో పాటు మరో నలుగురు కలసి గుట్టుగా సనావుల్లాతో బాలికకు పెళ్లి చేశారని పేర్కొన్నారు. అయితే కొన్నాళ్ల తర్వాత ఆ బాలికకు ఆడపిల్లకు జన్మనిచ్చిందని తెలిపారు. సనావుల్లా బాలికను పట్టించుకోకుండా ఆమెను వదిలించుకునేందుకు ప్రయత్నించాడని చెప్పారు. ఈ విషయం ఐసీడీఎస్‌తో పాటు పోలీసులకు తెలియడంతో సనావుల్లా తల్లిదండ్రులు, బాలిక తండ్రితో పాటు మైనర్ బాలికకు పెళ్లి జరిపించడానికి సహకరించిన మరో నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. సనావుల్లాను అరెస్ట్ చేసి మడకశిర జేఎంఎఫ్‌సీ కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 15 రోజులు రిమాండ్ విధించినట్లు తెలియజేశారు.

'ఆయుష్మాన్ భారత్'తో వయో వృద్ధుల ఆరోగ్యానికి భరోసా

ప్రశాంతి నిలయం: జిల్లాలో 70 సంవత్సరాలు నిండిన వయో వృద్ధులు ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన పథకంలో తమ పేరు నమోదు చేసుకోవాలని వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు వినోద్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా 70 ఏళ్లుపైబడిన వృద్ధులందరికీ వారి సామాజిక, ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా రూ.5 లక్షల వరకూ ఆరోగ్య రక్షణను అందిస్తోందని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా 2 వేల రకాల వైద్య చికిత్సలు అందించడం జరుగుతుందన్నారు. వెయిటింగ్ పీరియడ్ లేకుండా మొదటి రోజు నుంచే వ్యాధులకు సంబంధించి కవరేజ్ ఉంటుందన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో చేరేందుకు www. beneficiary. nha. gov. in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకొని కార్డు పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు టోల్ ఫ్రీ నంబర్ 14555కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని సూచించారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

ధర్మవరం అర్బన్: మైనర్ బాలికను లైంగిక వేధింపులకు గురి చేసిన యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ధర్మవరం ఒకటో పట్టణ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. ధర్మవరంలోని ఓ కాలనీకి చెందిన బాలిక 9వ తరగతి చదువుతోంది. ఈ క్రమంలో అదే వీధికి చెందిన యువకుడు లక్ష్మణ్... మూడు వారాలుగా బాలికను లైంగిక వేధింపులకు గురి చేస్తూ వచ్చాడు. పలుమార్లు బాలిక తల్లిదండ్రులు దండించినా అతని ప్రవర్తనలో మార్పురాలేదు. వేధింపులు తారస్థాయికి చేరుకోవడంతో గురువారం రాత్రి 10.30 గంటలకు పోలీసులకు బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

ఆకట్టుకున్న మెగా ఎడ్యుకేషన్ ఎక్స్‌పో



సంభ్రమ్ ఇన్‌స్టిట్యూట్ గురించి తెలుసుకుంటున్న విద్యార్థులు



ఎస్ఈఏ(సీ) ఇంజినీరింగ్ కళాశాల స్టాల్ వద్ద విద్యార్థుల సందడి



హిందూస్తాన్ బిజినెస్ స్కూల్, హిందూస్తాన్ ఏవియేషన్ అకాడమీ గురించి విద్యార్థులకు వివరిస్తున్న నిపుణులు

అనంతపురం: నగరంలోని గుత్తి రోడ్డులో ఉన్న టీవీఆర్‌కే ఫంక్షన్ హాలు వేదికగా రెండు రోజుల పాటు ఏర్పాటు చేసిన మెగా ఎడ్యుకేషన్ ఎక్స్‌పో గురువారం ప్రారంభమైంది. తొలి రోజే విశేష స్పందన లభించింది. ఎడ్యుకేషన్ ఎక్స్‌పోలో అనేక విద్యా సంస్థలు ప్రాతినిథ్యం వహించాయి. బెంగళూరుకి చెందిన హిందూస్తాన్ ఏవియేషన్ అకాడమీ (మారతహళ్లి), సంభ్రమ్ ఇనిస్టిట్యూట్ (జాలహళ్లి ఈస్ట్), ఎస్ఈఏ(సీ) ఇంజినీరింగ్ కళాశాల (కృష్ణరాజపురం)ల్లో అందించే కోర్సులు, ఫీజులు, అడ్మిషన్ల ప్రక్రియ, క్యాంపస్ ప్లేస్‌మెంట్స్, పరిశ్రమల అవసరాలకు తగినట్లుగా అందించే కోర్సులు, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ప్రవేశపెట్టిన వినూత్న కోర్సులపై విద్యార్థులకు నిపుణులు అవగాహన కల్పించారు. ప్రత్యేక స్టాళ్లను విద్యార్థులు, తల్లిదండ్రులు పరిశీలించి .. కళాశాలల గురించి వివరాలు సేకరించారు. బెంగళూరులో చదవాలనుకునే విద్యార్థులకు ఇదొక చక్కని అవకాశమని పేర్కొన్నారు. కాగా, శుక్రవారంతో ఈ ఎక్స్‌పో ముగియనుంది.